అక్షర విజేత
Email: vijethatelugudaily@gmail.com
రిపోర్టర్స్ కావలెను
బి. అనిల్‌కుమార్, ఎడిటర్
77028 66885

తెలుగు జాతీయ దినపత్రిక
అక్షర విజేత
నిజం నిర్భయం నిష్పక్షం
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక

B. ANIL KUMAR
CHAIRMAN & CHIEF EDITER
7702866885
9059324231
అక్షర విజేత
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక
DAIWIK PUBLICATIONS & BROADCASTING PVT. LTD.
www.aksharavijetha.com., epaper.aksharavijetha.com
email : vijethatelugudaily@gmail.com
కావలెను
విజేత ఛానల్‌లో పని చేయుటకు రెండు తెలుగు రాష్ట్రాల నుండి విలేకరులు, యాంకర్లు, న్యూస్ ఎడిటర్లు, కంటెంట్ రైటర్స్, కెమెరా మెన్, మరియు స్టూడియోలో పనిచేయుటకు స్త్రీ & పురుష సిబ్బంది కావలెను.
సీనియర్లకు ప్రాధాన్యత ఉంటుంది.
సంప్రదించుటకు: 7702866885, 9059324231

ఆంధ్రప్రదేశ్ సంపుటి:05 సంచిక :78 ఎడిటర్ : బి. అనిల్ కుమార్ పేజిలు : 10, వెల. 6రూ/ మంగళవారం 23 డిసెంబర్ 2025

# కర్ణాటక నాయకత్వ మార్పుపై తుది నిర్ణయం రాహుల్ గాంధీదే



కర్ణాటకలో ముఖ్యమంత్రి మార్పుపై కొనసాగుతున్న ఊహాగానాలకు తెరదించేలా సీఎం సిద్ధరామయ్య కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర సీఎం మార్పు రగడపై అగ్రనేత నేత రాహుల్ గాంధీ నిర్ణయం తీసుకుంటారని అన్నారు. కాంగ్రెస్ అధిష్ఠానం తీసుకునే నిర్ణయానికే తామంతా కట్టుబడి ఉంటామని ఆయన స్పష్టం చేశారు. సోమవారం తన సొంతూరు మైసూరులో ఆయన మీడియాతో మాట్లాడారు.సీఎం మార్పుపై మీడియా పదేపదే చర్చించడంపై సిద్ధరామయ్య అసహనం వ్యక్తం చేశారు. "ఈ విషయంపై ఇన్ని ప్రశ్నలు ఎందుకు? నేను ఇప్పటికే శాసనసభలో దీని గురించి మాట్లాడాను. మళ్ళీ చర్చ అనవసరం" అని అన్నారు. తాను పూర్తికాలం సీఎంగా కొనసాగుతానని ఇటీవల అసెంబ్లీ వేదికగా ప్రకటించిన సిద్ధరామయ్య, తాజా వ్యాఖ్యలతో బంతిని అధిష్ఠానం కోర్టులోకి నెట్టారు.గతవారం మంత్రి కేఎన్ రాజన్న, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌తో భేటీ అయిన విషయంపై అడిగిన ప్రశ్నకు సిద్ధరామయ్య స్పందిస్తూ.. "డీకే శివకుమార్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు. ఆయన్ను కలవడంలో తప్పేముంది?" అని ప్రశ్నించారు.మరోవైపు, సిద్ధరామయ్య, శివకుమార్ మధ్య ఆధిపత్య పోరుపై ప్రతిపక్ష బీజేపీ విమర్శలు గుప్పిస్తోంది. కాంగ్రెస్ అధిష్ఠానానికి ఈ సమస్యను పరిష్కరించే సత్తా లేదని ఎద్దేవా చేస్తోంది. ఈ వారంలో డీకే శివకుమార్ ఢిల్లీ పర్యటనకు వెళ్లనుండటం, శనివారం జరగనున్న కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశానికి సిద్ధరామయ్యకు ఆహ్వానం అందే అవకాశం ఉండటంతో.. కర్ణాటక రాజకీయాలు మరింత వేడెక్కాయి.

## పీవీ సునీల్ కుమార్ పై డీజీపీకి ఫిర్యాదు చేసిన రఘురామ



ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, సస్పెండ్ అయిన ఐపీఎస్ అధికారి పీవీ సునీల్ కుమార్ మధ్య వివాదం తీవ్రస్థాయికి చేరింది. రఘురామపై సునీల్ కుమార్ తీవ్ర ఆరోపణలు చేస్తూ, ఆయన్ను అన్ని పదవుల నుంచి తొలగించాలని డిమాండ్ చేయడం తెలిసిందే. దీనికి ప్రతిగా, తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్న సునీల్ కుమార్‌ను సర్వీస్ నుంచి డిస్మిస్ చేయాలంటూ రఘురామ డీజీపీకి ఫిర్యాదు చేశారు.రఘురామకృష్ణరాజుపై సీబీఐ ఎఫ్ఐఆర్ నమోదు చేసిందంటూ ఇటీవల సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన సునీల్ కుమార్... ఆయన్ను, ఆయన కుటుంబసభ్యులను అరెస్ట్ చేయడానికి సుప్రీంకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని పేర్కొన్నారు. డిప్యూటీ స్పీకర్ హోదాలో ఉన్న వ్యక్తి అరెస్ట్ అయితే అది రాష్ట్రానికే తలవంపులని, అమరావతి బ్రాండ్ ఇమేజ్ దెబ్బతింటుందని తెలిపారు. ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి, నారా లోకేశ్ కష్టపడి తెస్తున్న పెట్టుబడులు వెనక్కిపోయే ప్రమాదం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు.న్యాయం అందరికీ సమానంగా ఉండాలని, తనను సస్పెండ్ చేసినప్పుడు రఘురామను కూడా పదవి నుంచి తప్పించాలని సునీల్ కుమార్ డిమాండ్ చేశారు. కేసు విచారణ పూర్తయి, న్యాయస్థానంలో నిర్దోషిగా తేలిన తర్వాత ఆయనకు ఏ పదవి ఇచ్చినా అభ్యంతరం లేదని స్పష్టం చేశారు.సునీల్ కుమార్ ఆరోపణలపై రఘురామకృష్ణరాజు తీవ్రంగా స్పందించారు. సునీల్ కుమార్ సర్వీస్ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని, ఆన్‌లైన్ వీడియోలో చేసిన ఆరోపణలన్నీ అవాస్తవాలని పేర్కొంటూ డీజీపీకి ఫిర్యాదు చేశారు. ఆయనపై తక్షణమే డిస్మిసల్ ప్రొసీడింగ్స్ ప్రారంభించాలని కోరారు.

## మీరు తప్పు చేసినట్టు నాకు తెలిస్తే చూస్తూ ఊరుకోను: పవన్ కల్యాణ్

**-అధికారాన్ని దుర్వినియోగం చేయొద్దని నేతలకు పవన్ హెచ్చరిక**



నామినేటెడ్ పదవులు పొందిన జనసేన నాయకులకు పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ గట్టి హెచ్చరిక జారీ చేశారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని తప్పుడు పనులు చేస్తే చూస్తూ ఊరుకోబోనని స్పష్టం చేశారు. మంగళగిరిలోని సీకే కన్వెన్షన్‌లో జనసేన నిర్వహించిన 'పదవి-బాధ్యత' సమావేశంలో ఆయన పార్టీ నేతలను ఉద్దేశించి ప్రసంగించారు."మీకు వచ్చిన పదవులను బాధ్యతగా నిర్వర్తించండి. రెండు చేతులు జోడించి కోరుకుంటున్నాను, అధికారాన్ని దుర్వినియోగం చేయకండి. మీరు తప్పు చేసినట్టు నాకు తెలిస్తే చూస్తూ ఊరుకోను" అని పవన్ తీవ్రంగా హెచ్చరించారు. ఓటమిలో కూడా పార్టీ కోసం బలంగా నిలబడినందువల్లే నేడు అందరికీ పదవులు దక్కాయని ఆయన గుర్తుచేశారు.యువతకు సరైన వేదిక అందించాలనే ఉద్దేశంతోనే జనసేన పార్టీని స్థాపించానని పవన్ తెలిపారు. "కొత్త పంథాను నమ్ముకొని ఎంతోమంది యువకులు నక్సలైట్లుగా మారారు. సరైన ఐడియాలజీ లేకపోతే ఇబ్బందులు వస్తాయి. అందుకే సలసల మరిగే యువతకు జనసేన ఒక వేదిక కావాలని ఆకాంక్షించాను" అని వివరించారు. కాంగ్రెస్ నుంచి వైసీపీ ఏర్పడినప్పుడు వారికి సిద్ధంగా కేడర్ వచ్చిందని, కానీ జనసేన మాత్రం ప్రతిదీ సొంతంగా నిర్మించుకోవాల్సి వచ్చిందని అన్నారు.జనసేన సిద్ధాంతం అందరినీ కలుపుకొనిపోయేదే తప్ప విడదీసేది కాదన్నారు. జాతీయ దృక్పథంతోనే తాను ప్రాంతీయ పార్టీని పెట్టానని స్పష్టం చేశారు. పర్యావరణాన్ని కాపాడుతూనే అభివృద్ధి జరగాలని, మనం చేసే ప్రతి పని రాజ్యాంగానికి లోబడే ఉండాలని ఆయన పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.



## సోనియా, రాహుల్ గాంధీలకు ఢిల్లీ హైకోర్టు నోటీసులు

**-నేషనల్ హెరాల్డ్ కేసులో హైకోర్టు నోటీసులు**

**-ఈడీ ఛార్జ్‌షీట్‌ను పరిగణనలోకి తీసుకోవడానికి ట్రయల్ కోర్టు నిరాకరణ**

**-ట్రయల్ కోర్టు తీర్పును ఢిల్లీ హైకోర్టులో సవాల్ చేసిన ఈడీ**

నేషనల్ హెరాల్డ్ కేసులో కాంగ్రెస్ అగ్ర నాయకులు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలకు ఢిల్లీ హైకోర్టు నోటీసులు జారీ చేసింది. ఈ కేసులో మనీలాండరింగ్ ఆరోపణలతో ఈడీ దాఖలు చేసిన ఛార్జ్‌షీట్‌ను పరిగణనలోకి తీసుకోవడానికి ట్రయల్ కోర్టు నిరాకరించింది. ఈ తీర్పును ఈడీ ఢిల్లీ హైకోర్టులో సవాల్ చేసింది. దీంతో రాహుల్, సోనియా గాంధీతో పాటు ఈ కేసులోని ఇతరులకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది.నేషనల్ హెరాల్డ్ పత్రికను నడిపే ఏజేఎల్‌కు కాంగ్రెస్ పార్టీ రూ.90 కోట్ల రుణం అందించింది. అందుకు బదులుగా ఏజేఎల్ కంపెనీ ఆస్తులను తమ ఆధీనంలోకి తీసుకుంది. అయితే ఈ వ్యవహారంలో సోనియా, రాహుల్, ఇతర కాంగ్రెస్ నేతలు మోతీలాల్ వోరా, ఆస్కార్ ఫెర్నాండేజ్, సుమన్ దూబే తదితరులు మనీలాండరింగ్‌కు పాల్పడినట్లు ఈడీ ఆరోపిస్తోంది.ఏజేఎల్ కంపెనీ ఆస్తులను స్వాధీనం చేసుకున్న యంగ్ ఇండియన్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలో సోనియా గాంధీ, రాహుల్ గాంధీ ప్రధాన వాటాదారులుగా ఉన్నారు. ఈ సంస్థ కేవలం రూ.50 లక్షలు చెల్లించి ఏజేఎల్‌కు చెందిన సుమారు రూ.2 వేల కోట్ల విలువైన ఆస్తులు పొందారని ఈడీ తన ఛార్జ్‌షీట్‌లో పేర్కొంది


## ఏపీలో షూటింగులు చేసుకునే సినిమాలకు ప్రోత్సాహకాలు ఇస్తాం



టాలీవుడ్ కి ఏపీ సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేశ్ గుడ్ న్యూస్ చెప్పారు. ఉగాది నాటికి నంది అవార్డులు, నంది నాటకోత్సవాలు నిర్వహించాలని కూటమి ప్రభుత్వం ఆలోచిస్తోందని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా దీనికి సానుకూలంగా ఉన్నారని చెప్పారు. సినీ పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యలపై త్వరలోనే కీలక సమావేశం నిర్వహిస్తామని మంత్రి తెలిపారు. తొలుత సినిమాటోగ్రఫీ, హోంశాఖల నేతృత్వంలో ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహిస్తామని... ఏపీలో షూటింగులు, సినిమా టికెట్ రేట్లు, హై బడ్జెట్ సినిమాల టికెట్ ధరలపై చర్చిస్తామని చెప్పారు. ఆ సమావేశం అనంతరం సినీ ప్రముఖులతో సమావేశం నిర్వహిస్తామని, ఆ సమావేశాలకు సంబంధించిన తేదీలను త్వరలోనే ప్రకటిస్తామని తెలిపారు. ఏపీలో షూటింగ్ చేసుకునే సినిమాలకు మరింత ప్రోత్సాహం అందిస్తామని చెప్పారు.

# ఆబ్కారీ శాఖపై సీఎం చంద్రబాబు సమీక్ష

**-ఆదాయం కాదు... ఆరోగ్యకరమైన వృద్ధి సాధించాలని సూచన -లాటరీ విధానం, రిటైలర్ మార్జిన్ పెంపుపై పునఃపరిశీలన**



రాష్ట్రంలో మద్యం విధానాన్ని వ్యాపారంలా చూడకుండా, ఆరోగ్యకరమైన వృద్ధి సాధించేలా చూడాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు సూచించారు. ఆదాయమే లక్ష్యంగా విధానాలు ఉండకూడదని, మద్యాన్ని కూడా ఒక ఉత్పత్తిలానే పరిగణించాలని సీఎం స్పష్టం చేశారు. ప్రస్తుతం అనుసరిస్తున్న లాటరీ ద్వారా షాపుల కేటాయింపు, అప్లికేషన్ ఫీజు, ఇంకా... లిక్కర్ ఐడెంటిఫికేషన్ నెంబర్, రిటైలర్ మార్జిన్ పెంపు... తదితర అంశాలపై మరింత కసరత్తు చేయాలని సూచించారు.

బార్ ఏఆర్ఈటీ (అడిషనల్ రిటెయిల్ ఎక్సైజ్ టాక్స్) మినహాయింపు ఇచ్చే విషయాన్ని పరిశీలించాలని సీఎం నిర్దేశించారు. అక్రమ మద్యాన్ని అరికట్టడం, బెల్టు షాపుల నియంత్రణ, డిజిటలైజేషన్, పర్యావరణ పరిరక్షణకు సంబంధించి సంస్కరణలు తీసుకురావాల్సిందిగా అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. బెల్టు షాపుల నియంత్రణకు హర్యానా మోడల్‌పై అధ్యయనం చేయాలని నిర్దేశించారు.

సచివాలయంలో సోమవారం నాడు ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. దీనికి మంత్రులు కొల్లు రవీంద్ర, కొండపల్లి శ్రీనివాస్, ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ పీయూష్ కుమార్, ప్రొహిబిషన్-ఎక్సైజ్ శాఖ డైరెక్టర్ శ్రీధర్, ఎక్సైజ్ ఈడీ రాహుల్ దేవ్ శర్మ హాజరయ్యారు. కొత్త ఎక్సైజ్ విధానాల అమలు, వాటి ప్రభావంపై సమీక్షలో సమగ్రంగా చర్చించారు.

అనధికార విక్రయ కేంద్రాలుగా తయారైన బెల్ట్ షాపులపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. బెల్టు షాపులు పూర్తిస్థాయిలో కట్టడి చేయడానికి హర్యానాలో అనుసరించిన సబ్ లీజు విధానాన్ని అధ్యయనం చేయాలని అధికారులకు ముఖ్యమంత్రి సూచించారు. ప్రస్తుతం గ్రామీణ, దూర ప్రాంతాల్లో షాపులు లేకపోవడం వల్ల బెల్ట్ షాపుల సమస్య నెలకొందని అధికారులు చెప్పారు. అలాగే, పర్యావరణ పరిరక్షణలో భాగంగా... మద్యం వినియోగం అనంతరం బాటిల్ తిరిగి ఇస్తే డీఆర్ఎస్ (డిపాజిట్ రిటర్న్ స్కీమ్) కింద నగదు ఇచ్చే అంశాన్ని పరిశీలిస్తున్నామని చెప్పారు.

### పెరిగిన మద్యం విక్రయాలు

అక్టోబర్ 2024 నుంచి అక్టోబర్ 2025 వరకు...రూ.8,000 కోట్లు ఎక్సైజ్ ఆదాయం లక్ష్యం పెట్టుకోగా, రూ.7,041 కోట్లు ఆదాయం వచ్చినట్టు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. 2025%-%26 ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ 1 నుంచి డిసెంబర్ 17 వరకు మద్యం విక్రయాల్లో 4.52 శాతం పెరుగుదల కనిపించిందని... ఐఎంఎఫ్ఎల్ (ఇండియన్ మేడ్ ఫారిన్ లిక్కర్) విక్రయాలు 19.08 శాతం, బీర్ విక్రయాలు 94.93 శాతం పెరిగాయని అధికారులు వెల్లడించారు. ఈ డిసెంబర్ 18 నుంచి వచ్చే ఏడాది మార్చి నాటికి రూ.8,422 కోట్ల ఆదాయం వస్తుందని అంచనా వేసినట్టు అధికారులు తెలిపారు. మొత్తంగా ఈ ఆర్థిక సంవత్సరంలో 3 శాతం పెరుగుదల చూపిస్తామని అధికారులు చెప్పారు.

### 35 శాతం డిజిటల్ చెల్లింపులు

మద్యం విక్రయాల్లో డిజిటల్ చెల్లింపులు 34.9 శాతం పెరిగాయని, కొన్ని జిల్లాల్లో 40%-%47 శాతం వరకు డిజిటల్ లావాదేవీలు నమోదైనట్టు వివరించారు. అయితే నగదు వినియోగాన్ని తగ్గించి... డిజిటల్ చెల్లింపులు జరిగేలా అందరిలో అవగాహన పెంచాలని అధికారులకు సీఎం సూచించారు. రాష్ట్రంలో నకిలీ మద్యం, అవకతవకలకు ఆస్కారం లేకుండా ప్రతి మద్యం బాటిల్‌కు ప్రత్యేక లిన్ (లిక్కర్ ఐడెంటిఫికేషన్ నెంబర్) త్వరితగతిన తీసుకురావాలని, సాధారణ ప్రజలు కూడా సులభంగా గుర్తించేలా ఉండాలన్నారు. లిన్‌లో... బ్రాండ్, బ్యాచ్, లైన్‌తో పాటు తయారైన తేదీ, గంటలు, నిమిషాలు, సెకన్లు సహా వివరాలు ఉండాలన్నారు.



# ప్రజలకు మెరుగైన సేవలు అందించండి

## –ఎమ్మెల్యే బొలిశెట్టి

తాడేపల్లిగూడెం, (అక్షర విజేత) పశ్చిమగోదావరి జిల్లా బ్యూరో:
ప్రభుత్వ ఉద్యోగులు ప్రజలకు మెరుగైన సేవలు సకాలంలో అందించాలని,వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చే ప్రజలను ఆదరించాలని శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. తాడేపల్లిగూడెం తాహ సిల్దార్ నూతన కార్యాలయాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వంలో రెవెన్యూ డిపార్ట్మెంట్ ఎంతో కీలకమైందని ప్రజలకు నిరంతరం సేవలందించవలసిన బాధ్యత ఉద్యోగులపై ఉందని అన్నారు. నూతన కార్యాలయ ఏర్పాటుకు సహకరించిన తాసిల్దారు సునీల్ కుమార్ ను ఎమ్మెల్యే అభినందించారు. సునీల్ కుమార్ సేవలు ఆదర్శం తాడేపల్లిగూడెం తహసిల్దార్ ఎం.సునీల్ కుమార్ సేవలు ఆదర్శనీయమని బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. దాతల సహకారంతో సుమారు రెండు లక్షల రూపాయలు వెచ్చించి కార్యాలయాన్ని ఆధునికీకరించడం హర్షినియం అన్నారు. ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు సహజంగానే ఏదో ఆఫీసుకు వచ్చాం, మన పని చేసుకుని వెళ్లిపోయాం అనుకుంటూ ఉద్యోగ జీవితం గడిపేస్తారని కానీ మన ఇంటిని ఎంత అందంగా, సౌకర్యవంతంగా తీర్చిదిద్దుకుంటామో, అదేవిధంగా మనం పని చేసే కార్యాలయాన్ని కూడా అందంగా, సౌకర్యవంతంగా తీర్చిదిద్దుకోవాలన్నారు. అటువంటి మంచి దృక్పథం తహసిల్దార్ సునీల్ కుమార్ లో మెండుగా ఉందన్నారు. ఏదో ఆఫీసుకు వచ్చాం, పని,చేసుకుని వెళ్లిపోయాం అన్నట్లుగా కాకుండా తాను కూర్చుని పని చేసే ఆఫీసు సౌకర్యవంతంగా, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించే విధంగా ఉండాలనే సంకల్పంతో తహసిల్దార్ సునీల్ కుమార్ చేసిన కృషిని పలువురు ఆదర్శంగా తీసుకోవలసిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం నుంచి నిధుల కోసం ఎదురు చూడకుండా దాతల సహకారంతో కార్యాలయాన్ని ఆధునికరించడం అభినందనీయమన్నారు. ఆఫీసులో ప్రశాంతమైన వాతావరణం ఉంటే అధికారులు మరింత సమర్థవంతంగా ప్రజలకు మెరుగైన సేవలు అందించగలుగుతారన్నారు. కార్యాలయం ఆధునీకరణకు సహకరించిన దాతలకు ఎమ్మెల్యే ధన్యవాదాలు తెలియజేశారు. ఎప్పుడో బ్రిటిష్ వారి కాలంలో నిర్మించిన పురాతన భవనం శిథిలావస్థకు చేరడంతో తహసిల్దార్ కార్యాలయాన్ని గత కొన్ని సంవత్సరాలుగా వీఆర్వోల కోసం నిర్మించిన భవనంలో నిర్వహిస్తున్నారు. 2017లో నూతన భవన నిర్మాణం చేపట్టినప్పటికీ అది మధ్యలోనే ఆగిపోయింది. దీంతో ప్రస్తుతం ఉన్న కార్యాలయం భవనం ఇరుకుగా, అసౌకర్యంగా మారింది. దీంతో తహసిల్దార్ ఎం.సునీల్ కుమార్ చొరవ తీసుకుని దాతల సహకారంతో కార్యాలయాన్ని ఆధునికంగా, సౌకర్యవంతంగా తీర్చిదిద్దారు. కార్యక్రమంలో జనసేన నాయకులు పాలూరి వెంకటేశ్వరరావు, టిడిపి నాయకులు వాడపల్లి సుబ్బరాజు, పసల కొండ, పసుమర్తి రామలక్ష్మణులు, మద్దిపాటి రవితేజ, డిప్యూటీ తాసిల్దార్ కాళీ కృష్ణ, సివిల్ సప్లై డిప్యూటీ తహసిల్దారు అన్నపూర్ణ, గ్రామ రెవెన్యూ అధికారులు, ఆఫీసు సిబ్బంది పాల్గొన్నారు. మున్సిపల్ కమిషనర్ ఎం.ఏసుబాబు, ఎంపీడీవో వి.చంద్రశేఖరం తదితర అధికారులు తహసిల్దార్ సునీల్ కుమార్ కు అభినందనలు తెలియజేశారు.

# ఆలయ అభివృద్ధికి కృషి చేయాలి

తాడేపల్లిగూడెం (అక్షర విజేత) పశ్చిమగోదావరి జిల్లా బ్యూరో: అమ్మవారి ఆశీస్సులతో ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని ట్రస్టు బోర్డు సభ్యులను ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ కోరారు. తాడేపల్లిగూడెం మండలం ముత్యాలంబపురం లో వేంచేసి ఉన్న ముత్యాలమ్మ అమ్మవారి ఆలయ ట్రస్ట్ బోర్డ్ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఆయన సోమవారం పాల్గొన్నారు. ప్రభుత్వ సహాయ సహకారాలతో అమ్మవారి సన్నిధిలో కళ్యాణ మండప నిర్మాణానికి కృషి చేద్దామని అన్నారు. ఆయన అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం టెస్ట్ బోర్డ్ చైర్మన్ అన్నం నీడి శ్రీనివాస్ రావు, సభ్యులుగా మసే సత్య, పట్నాల సత్యవతి, ఉండి అన్నపూర్ణ, రాగాల రవి, ఎలమర్తి వీర్రాజు, మాదాసు త్రినాథ్ లక్ష్మీ, రామగాని భాస్కర్ సత్యనారాయణ, మాక శ్రీరామ్, కండెల్లి సుబ్బాయమ్మ, కుక్కునూరి వీర వెంకట దుర్గాప్రసాద్ ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ సహకారంతో 60 లక్షల రూపాయల వ్యయంతో ఆలయ ఆవరణలో కళ్యాణమండపం నిర్మిద్దాం అన్నారు. కార్యక్రమంలో అడపా ప్రసాద్, పాలూరు వెంకటేశ్వరరావు, రామ్ లక్ష్మణ్, వాడపల్లి సుబ్బరాజు పాల్గొన్నారు.





# అమ్మ సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో గిరిజనులకు దుప్పట్లు పంపిణీ



అక్షర విజేత మెంటాడ:
మెంటాడ మండల శివారు ప్రాంతం, అల్లూరి సీతారామరాజు జిల్లా,అనంతగిరి మండలం, రొంపిల్లి పంచాయితీ మధుర గిరిజన గ్రామమైన మంగళ గుడ్డుపేట లో సోమవారం అమ్మ సేవా ఫౌండేషన్ వారు గిరిజనులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకులు సురేష్ మాట్లాడుతూ మంచినీటి కొరత, విద్యుత్, రహదారి, సౌకర్యాలు లేక నానా ఇబ్బందులు పడుతున్నారు. త్రాగునీటి కోసం ఊట బావుల నీటిని వినియోగిస్తూ పలు రోగాలకు గురవుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న అమ్మ సేవా సంస్థ పరిశీలించి ఉన్నత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి సౌకర్యాలు కల్పనకు కృషి చేస్తామన్నారు. చలి తీవ్రత ఎక్కువగా ఉండడంతో గిరిజనులకు దుప్పట్లు, రగ్గులు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గుర్ల సర్పంచ్ ప్రతినిధి బొద్దల జగదీష్, గంద్రెటి ఈశ్వరరావు, పూర్ణాన పాపారావు, సాయి, లక్షణ, వెంకటరమణ, తదితర గిరిజనులు పాల్గొన్నారు.

# దాతృత్వం చాటుకున్న సుధాకర్రావు





ప్రత్తిపాడు ప్రతినిధి, అక్షర విజేత : పెదపూడి మండలం రామేశ్వరం గ్రామంలో అఖిలభారత దివ్యాంగుల హక్కుల పోరాట సమితి 20వ వార్షికోత్సవం సందర్భంగా అఖిలభారత దివ్యాంగుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు కే సుధాకర్రావు ఆధ్వర్యంలో రగ్గులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ అఖిల భారత దివ్యాంగుల హక్కుల పోరాట సమితి 20వ వార్షికోత్సవం సందర్భంగా దివ్యాంగులకు, వితంతువులకు,వృద్ధులకు సుమారు 100 పైగా రగ్గులను పంపిణీ చేయడం జరిగిందని,చలికాలంలో రగ్గులను పంపిణీ చేయడం వల్ల వృద్ధులు చలి తాకిడిని తట్టుకోగలుగుతారని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా దివ్యాంగుల అధ్యక్షురాలు అంబటి రాజకుమారి, ప్రెసిడెంట్ యేసు,సెక్రటరీ శీను, తారకు వంశీకృష్ణ,సిహెచ్ మనీ, సోషల్ వర్కర్స్ తదితరులు పాల్గొన్నారు

# అఖిలభారత మహాసభలను జయప్రదం చేయండి

ప్యాపిలి(అక్షర విజేత): విశాఖపట్నంలో డిసెంబర్ 31 నుంచి జనవరి 4 వరకు జరగనున్న సిఐటియు అఖిలభారత మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు ప్యాపిలి మండలం ప్రధాన కార్యదర్శి యస్.ఎ. చిన్న రహిమాన్ పిలుపునిచ్చారు. అధ్యక్షులు రామాంజనేయులు, ఉపాధ్యక్షులు నెట్టికల్లు, ఇలియాజ్ గ్రామ పంచాయతీ ఆవరణలో సిఐటియు ఆధ్వర్యంలో వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర%-%రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలు, లేబర్ కోడ్స్‌కు వ్యతిరేకంగా కార్మికులు, ఉద్యోగులు, ప్రజలను ఐక్యం చేసి పోరాటాలు ఉధృతం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు నాగేంద్ర, రవి, ఖాదర్, హనుమంతు, రాఘవేంద్ర, జాఫర్ తదితరులు పాల్గొన్నారు.



# ఉత్తమ ఉపాధ్యాయునికి ఘన సన్మానం

ప్యాపలి(అక్షర విజేత):
యూటీఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల లోజరిగిన సమావేశంలో నూతనంగా ఎన్నికైన యూటీఎఫ్ మండల శాఖ నాయకులు మండల పరిధిలోని హుస్సేనాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు సర్వజ్ఞ మూర్తి మండల ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన సందర్భంగా యూటీఎఫ్ రాష్ట్ర పూర్వ గౌరవాధ్యక్షులు నరసింహుడు ,జిల్లా గౌరవాధ్యక్షులు సుబ్బారాయుడు, యన్.ఎస్ బాబు తదితరుల చేతుల మీదుగా ఘనంగా సన్మానించడం జరిగింది.వారు మాట్లాడుతూ సర్వజ్ఞ సామాజిక స్పృహలో భాగంగా ఎన్నో సేవా కార్యక్రమాలు చేశారని డోన్ వివేకానంద సేవా సమితి ఆధ్వర్యంలోఎన్నో కార్యక్రమాలు చేశారని, ఇటీవలే హాస్టల్ పిల్లలకు దుప్పట్లు కూడా పంచారని,ఎంతో మందిని ఉన్నత పౌరులుగా తీర్చి దిద్దారని.తన తెలుగు బోధనకు ఆకర్షితులై ఇటీవలే మండలం నుండి తెలుగు ఉపాధ్యయులుగా డిఎస్సి 2025 ద్వారా కూడా ఎన్నికయ్యారని అన్నారు.ఒకవైపు యూటీఎఫ్ నాయకునిగా సామాజిక స్పృహతో సేవా కార్యక్రమాలు చేస్తూ,జన విజ్ఞాన వేదిక నంద్యాల జిల్లా ఉపాధ్యక్షులుగా సైన్స్ పట్ల,మూఢ నమ్మకాల పట్ల,మూఢ విశ్వాసాలు పట్ల విద్యార్థులకు ప్రజలకు అవగాహన కల్పిస్తూ ముందుకు వెళ్తున్న సర్వజ్ఞ భవిష్యత్ లో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందాలని ఆశిస్తున్నట్లు నూతనంగా ఎన్నికైన అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రాజేంద్ర ,అబ్దుల్ లతీఫ్ మరియు సహాధ్యక్షులు నాగమణి,అబ్దుల్ రహీం ,గౌరవాధ్యక్షులు శేషయ్య,ఆర్థిక కార్యదర్శి సాలయ్య అన్నారు.ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ మండల నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.



# చిలకలూరిపేటలో ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధుల సాధారణ సమావేశం

చిలకలూరిపేటఅక్షర విజేత
: పట్టణంలోని మోడరన్ కాంప్లెక్స్‌లో గల కళ్యాణ మండపంలో చిలకలూరిపేట నియోజకవర్గ స్థాయి ఎలక్ట్రానిక్ మీడియా సాధారణ సమావేశం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఏపీఈఎంజేఏ (%ూ్రాజువీజీూ%) రాష్ట్ర కార్యదర్శి షేక్ మస్తాన్ వలి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు ఎదుర్కొంటున్న సమస్యలు, వృత్తిపరమైన సవాళ్లు మరియు భవిష్యత్ కార్యాచరణ వంటి పలు కీలక అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. మీడియా రంగంలో పనిచేస్తున్న వారందరూ సమన్వయంతో ఉంటూ, జర్నలిజం విలువలను కాపాడాలని ఈ సందర్భంగా నేతలు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు శ్రీకాంత్, అధ్యక్షుడు సుభాని, కార్యదర్శి సిద్దిక్, ట్రెజరర్ నవీన్ లతో పాటు నియోజకవర్గ పరిధిలోని ఎలక్ట్రానిక్ మీడియా సభ్యులు సంఖ్యలో పాల్గొన్నారు.



# తుబాడు సెమీ క్రిస్మస్ వేడుకలలో పాల్గొన్న మాజీమంత్రి ప్రత్తిపాటి పుల్లారావు.



తుబాడు అక్షర విజేత
నాదెండ్ల మండలం తుబాడు గ్రామంలో తెలుగుదేశం పార్టీ నాయకులు దగ్గుమల్లి సాంబయ్య సాంబయ్య ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీమంత్రివర్యులు, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు పాల్గొని కేక్ కటింగ్ చేసి ప్రజలందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ప్రత్తిపాటి మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా చంద్రబాబు ప్రభుత్వమే సూపర్-6 సహా , పలు పథకాలు అందిస్తోందన్నారు. ప్రతి ఒక్కరూ స్వార్థం వీడి, సమాజహితం, రాష్ట్రక్షేమం కోరుకోవాలని, అదే ఏసుక్రీస్తు మనకు చూపిన సన్మార్గమని ప్రత్తిపాటి హితవుపలికారు. వ్యక్తిగత విద్వేషాలు, వైషమ్యాలు, పరనిందల్ని ప్రభువు మెచ్చడన్నారు. క్రీస్తుబోధనలు ఆచరణలో పాటిస్తూ, ఆయన చూపిన మార్గంలో నడవడమే మనం ఆ కరుణామయునికి ఇచ్చే గొప్పకానుకని ప్రత్తిపాటి తెలిపారు.ఈ కార్యక్రమంలో టిడిపి సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మండల అధ్యక్షులు బండారుపల్లి సత్యనారాయణ, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, డీఎం హరిగోపాల్, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ పిల్లి కోటేశ్వరరావు, గ్రామ నాయకులు గాదె రాయపు రెడ్డి, దగ్గుమల్లి వెంకటేశ్వర్లు, షేక్ యాసిన్, రాజు, వాసుమల్ల మారియ కుమారు, వెంకయ్య గ్రామ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పర్యాటకులతో కిటకిటలాడుతున్న అరకులోయ

అక్షర విజేత అరకు లోయ..
ప్రముఖ పర్యటక కేంద్రమైన ఆంధ్ర ఊటీ అందాల అరకులోయలో పర్యాటకుల రద్దీ కొనసాగుతూనే ఉంది.కార్తీక మాసం ముగిసి రెండు వారాలు ముగుస్తున్నప్పటికీ పర్యాటకులు తాకిడి అరకులోయకు ఏ మాత్రం తగ్గడం లేదు.కార్తీక మాసంతో సంబంధం లేకుండా దేశ విదేశీ పర్యటకులు,రెండు తెలుగు రాష్ట్రాల సందర్శకులు అరకులోయ వీక్షణకు తండోపతండాలుగా తరలివస్తున్నారు.గతంలోనూ కార్తీకమాసంలోనే పర్యాటకుల సందడి కనిపించేది.అయితే ఇప్పుడు సీజన్ తోసంబంధం లేకుండా అనునిత్యం అరకులోయలో సందర్శకుల తాకిడి కనిపిస్తూనే ఉంది. దీనివలన అరకులోయలో ప్రసిద్ధ సందర్శనీయ ప్రాంతాలైన పద్మావతి ఉద్యానవన కేంద్రం, చాపరాయి జలపాతం,గిరిజన సంస్కృతిక మ్యూజియం,రణజల్లెడ జలపాతం,అనంతగిరి, సుంకరమెట్ట కాఫీ తోటలు, గాలికొండ వ్యూ పాయింట్, చాపరాయి జలపాతం, కటికి జలపాతం,బొర్రా గుహలు,పర్యాటకుల తాకిడితో కిటకిటలాడుతూ కళకళలాడుతున్నాయి.ప్రస్తుతం అరకులోయలో చలి విజృంభిస్తూ మంచు దుప్పటి కప్పుకుంటూ పర్యాటకులను ఆహ్లాదబరితులను గురిచేస్తుంది. విపరీతమైన చలి ప్రభావం ఉన్నప్పటికీ దట్టమైన మంచి దుప్పట్లో ఆహ్లాద భరితంగా సేదతీరి సెల్ఫీలు తీసుకోవాలన్న సంకల్పంతో పర్యాటకులు వణికించి చలిని లెక్కచేయకుండా మంచి దుప్పట్లో ఆస్వాదించాలని అరకులోయ పట్టణ రహదారిలపైకి వస్తున్నారు.దీంతో అరకులోయ పర్యటక ప్రాంతం వేకువజామునే సందర్శకులతో సందడి సందడిగా కనిపిస్తుంది.



# పేట పంచాయతీలో ఆక్రమిత పబ్లిక్ స్థలాలను పరిరక్షించాలి

**-ఉప సర్పంచ్ జగతా భవాని అధ్యక్షతన పంచాయతీ పాలకవర్గం ఏకగ్రీవ తీర్మానం**

**-పట్టణంలో సర్వేనెంబర్ 132-3బి లో గల 552 గజాల పబ్లిక్ స్థలానికి అక్రమ ఎన్వోసీ ఇచ్చిన ఈఓ పై విచారణకు తీర్మానం ఆమోదం**

పాయకరావుపేట (అక్షర విజేత):
పట్టణంలోని పంచాయతీలో ఆక్రమిత
పబ్లిక్ స్థలాల పరిరక్షించాలని ఉప సర్పంచ్ జగతా భవాని అధ్యక్షతన ఇక్కడి పంచాయతీ కార్యాలయంలో సోమవారం జరిగిన పాలకవర్గ సాధారణ సమావేశంలో సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు.ప్రధానంగా పట్టణంలోని జిల్లా పరిషత్ గెస్ట్ హౌస్ ఎదురుగా 1985 లో వేసిన పంచాయతీ ఆమోదిత లే ఔట్ నకు సంబంధించి సర్వే నెంబర్ 132-3బి లో 552 గజాల పబ్లిక్ స్థలాన్ని అప్పట్లో లేఅవుట్ యజమాని
స్థానిక పంచాయతీకి కేటాయించిన విషయం తెలిసిందే. అయితే
2010 ప్రాంతంలో అప్పటి కార్యనిర్వహణ అధికారి (ఈవో) ఒక రియల్టర్ కు అడ్డుగోలుగా ఎన్వోసీ ఇచ్చిన ఈఓ పై విచారణకు పాలకవర్గం ఏకగ్రీవ తీర్మానం ఆమోదించింది. దీంతోపాటు ఉపసర్పంచ్ జగతా భవాని అధ్యక్షతన
జరిగిన పాలకవర్గ సాధారణ సమావేశంలో పంచాయతీ అభివృద్ధి, సంక్షేమ పనుల నిర్వహణకు సంబంధించి 4 ప్రధాన అంశాలపై తీర్మానాలను ఆమోదిస్తూ పాలకవర్గం నిర్ణయించింది. ఇందులో ప్రధానంగా పట్టణంలోని జడ్పీ అతిథి భవనం ఎదురుగా ఉన్న
గతంలో వేసిన పంచాయితీ ఆమోజిత లేఔట్ లో గల సర్వే నెంబర్ 132-3బి లో అప్పట్లో స్థానిక పంచాయతీకి కేటాయించిన 552 గజాల సుమారు 5 కోట్ల రూపాయల విలువైన పంచాయితీ
పబ్లిక్ స్థలాన్ని ఒక రియల్టర్ అడ్డుదారిలో కొనుగోలు చేసిన విషయం తెలిసిందే.ఆ రియల్టర్ పంచాయతీ పబ్లిక్ స్థలాన్ని ఆక్రమించు కోవడంతో పాటు ఆ స్థలం తనదేనం టూ న్యాయస్థానాన్ని ఆశ్రయించిన విషయమై
తలెత్తిన న్యాయపరమైన చిక్కులను ఎదుర్కొనేందుకు వీలుగా అవసరమైతే పంచాయతీ నిధులతో ప్రైవేట్ లాయర్ ద్వారా వ్యాజ్యం వేయించి వాద ప్రతి వాదనలు నెరపడం ద్వారా కోట్ల విలువైన పంచాయతీ పబ్లిక్ స్థలాన్ని కాపాడుకోవాలని పాలకవర్గం ఒక తీర్మానాన్ని ఆమోదించింది.అలాగే పట్టణంలోని జెడ్పి బాలికోన్నత పాఠశాలకు సుమారు 80 లక్షల రూపాయల వ్యయం కాగల ల్యాబ్ మంజూరైన విషయం తెలిసిందే.దీనికి అవసరమైన స్థలం కేటాయింపు కోసం సంబంధిత విద్యా శాఖ విభాగం అధికారులు కోరిన మీదట అక్కడ సమీపంలో మంగవరం రోడ్డు వద్ద
మండల పరిషత్ ఆధీనంలో ఉన్న విత్తనాల గోదాం స్థలాన్ని కేటాయించాలని మండల పరిషత్ విభాగం అధికారులను కోరుతూ పాలకవర్గం తీర్మానాన్ని ఆమోదించింది.అలాగే పట్టణంలోని సాయి ఆదర్శ్ నగర్ లో ఎంపీ నిధులతో ఇటీవల నిర్మించ తలపెట్టిన సామాజిక భవనం గతంలో ఆ కాలనీ వాసుల నుంచి తల ఎత్తిన కొన్ని న్యాయపరమైన చిక్కుల దృష్ట్యా కమ్యూనిటీ హాలు నిర్మాణం అర్ధాంతరంగా నిలిచిపోయింది.
సాయి ఆదర్శ్ నగర్ లో కమ్యూనిటీ హాల్ తిరిగి నిర్మించాలని తాజాగా



అక్కడి కాలనీ వాసుల విజ్ఞప్తి మేరకు సామాజిక భవనం నిర్మాణానికి అవసరమైన నిధులు కేటాయించాలని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనితను కోరుతూ పాలకవర్గం మరో తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించింది.పట్టణ వాసుల వసతుల కల్పనకు సంబంధించి ఎప్పటి మాదిరిగానే అభివృద్ధి సంక్షేమ పనులు యధావిధిగా కొనసాగించాలని ఉప సర్పంచ్ జగత భవాని అధ్యక్షతన జరిగిన సమావేశంలో పాలకవర్గం ఏకగ్రీవంగా ఆమోదించింది.ఈ సమావేశంలో పంచాయతీ పాలకవర్గ సభ్యులు,సిబ్బంది పాల్గొన్నారు.





# జగన్నాధపురం పాఠశాలలో గణిత శాస్త్ర కోవిధుడు రామానుజన్ జయంతి వేడుకలు

తర్లుపాడు మండలంలోని జగన్నాధపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సోమవారం నాడు భారతీయ గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ 138వ జయంతి వేడుకలను (జాతీయ గణిత దినోత్సవం) ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు కశెట్టి జగన్ బాబు నాయకత్వం వహించారు.ముందుగాశ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించిప్రధానోపాధ్యాయులు జగన్ బాబు మాట్లాడుతూ, అతి చిన్న వయసులోనే గణిత శాస్త్రంలో ప్రపంచంగర్వించదగ్గ ఆవిష్కరణలుచేసినమహనీయుడు రామానుజన్ అని కొనియాడారు.ఎటువంటి అధికారిక శిక్షణ లేకుండానే క్లిష్టమైన సిద్ధాంతాలను, సమీకరణాలను రామానుజన్ సాధించారని వివరించారు.ప్రసిద్ధ సంఖ్య 1729 వెనుక ఉన్న విశిష్టతను విద్యార్థులకు ఆసక్తికరంగా వివరించి, వారిలో గణితం పట్ల ఆసక్తిని పెంపొందించారు.ప్రతి విద్యార్థి రామానుజన్‌ను స్ఫూర్తిగా తీసుకుని, కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు.శ్రీనివాస రామానుజన్ జీవితం మరియు ఆయన సాధించిన అద్భుతమైన విజయాల గురించి లోతైన అవగాహన కల్పిస్తుంది అని విద్యార్థులకు తెలిపారు ఈ కార్యక్రమంలోఉపాధ్యాయురాలు యం అనూష పాల్గొన్నారు

# రెడ్ క్రాస్ కు హెపటైటీస్ వాక్సిన్ సమకూర్చుతా -ఆర్డీ విల్సన్

**కావలి రెడ్ క్రాస్ ను సందర్శించిన ఏపీ తెలుగు సంస్కృత అకాడమీ ఛైర్మన్ ఆర్డీ విల్సన్**

కావలి
కావలి రెడ్ క్రాస్ కు కామెర్ల వ్యాధిని నిరోదించే హెపటైటిస్ వాక్సిన్ సమకూర్చుతానని, ఆ వాక్సిన్ ను సాంఘిక సంక్షేమ హాస్టళ్ళలో చదువుకునే విద్యార్థులకు వేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తెలుగు సంస్కృత అకాడమీ చైర్మన్ ఆర్డీ విల్సన్ కోరారు. సోమవారం అయన కావలి రెడ్ క్రాస్ ను సందర్శించి, అక్కడ నిర్వహించే సేవల గురించి రెడ్ క్రాస్ ప్రతినిధులతో సమీక్షించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ డి శ్రీహరిరావు ఆహ్వానం మేరకు విజయవాడలోని ఏపీ రెడ్ క్రాస్ ప్రధాన కేంద్రాన్ని సందర్శించానని, ఈ సందర్బంగా రాష్ట్ర రెడ్ క్రాస్ చైర్మన్ వైడి రామారావు, వైస్ చైర్మన్ పి రామచంద్రరాజు కావలి రెడ్ క్రాస్ సేవలను ప్రశంసించారని అన్నారు. తనవంతుగా కావలి రెడ్ క్రాస్ కు సహకరిస్తానని అన్నారు. రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రిసత్యకుమార్ యాదవ్ తో మాట్లాడి ప్రభుత్వాపరంగా కొన్ని సదుపాయాలు అందేవిధంగా ప్రయత్నిస్తానని అన్నారు. రెడ్ క్రాస్ ప్రతినిధులు, సిబ్బంది ఆర్డీ విల్సన్ ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కావలి రెడ్ క్రాస్ చైర్మన్ డి రవిప్రకాష్, వైస్ చైర్మన్ కె హరినారపరెడ్డి, పాలకమండలి సభ్యులు ఓరుగంటి వెంకటేశ్వర్లు, బెజవాడ ప్రసన్నకుమార్, జనిగర్ల మనోహర్, బీజేపీ నేతలు కంచర్ల మురళీకృష్ణ నాయుడు, కె బ్రహ్మానందం, అంచిపాకు కమల, మందా కిరణ్ కుమార్, జలదంకి ఎంపిటిసి కె మాధవరావు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.





# జేగురుపాడు గ్రామంలో ఘనంగా జగన్ పుట్టినరోజు వేడుకలు.




కడియం
అనేక సంక్షేమ అభివృద్ధి పథకాలతో రాష్ట్రాన్ని నడిపించిన మాజీ ముఖ్యమంత్రి జగన్ మరిన్ని పుట్టినరోజులు జరుపుకోవాలని కడియం మండలం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, గ్రామ సర్పంచ్ యాదవుల సతీష్ చంద్ర స్టాలిన్ శుభాకాంక్షలు తెలియజేశారు. కడియం మండలం జేగురుపాడు గ్రామంలో మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి జన్మదినం సందర్భంగా స్టాలిన్ యువసేన ఆధ్వర్యంలో, అలాగే జగనన్న కాలనీలో స్థానిక యువత ఏర్పాటుచేసిన జగన్ పుట్టినరోజు కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సతీష్ చంద్ర స్టాలిన్ పాల్గొన్నారు.అనంతరం భారీ కేక్ కట్ చేసి మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా స్టాలిన్ మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి ప్రజలందరి ఆశీస్సులు వారికి ఎల్లప్పటికీ ఉండాలని కోరుతున్నామని, 2029లో ఆయన నాయకత్వంలో వైసీపీ పార్టీని గెలిపించి మరోసారి ముఖ్యమంత్రి అయ్యేందుకు ప్రజలంత దీవించాలని ఆకాంక్షిస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు ఆకుల సుధాకర్, నాగిరెడ్డి మోహన్,మాజీ ఎంపీటీసీ సభ్యులు నాగిరెడ్డి వీర శివాజీ, పుట్టా బుజ్జి, బళ్ల అన్నవరం,శాకా కిరణ్, బుడ్డిగ లక్ష్మణరావు, మారిశెట్టి నాగన్న, అంగర రాజు, చంద్రగిరి శంకరం, పినిశెట్టి దుర్గా ప్రసాద్, స్థానిక యువత, జగన్ అన్న అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



# జగన్ స్ఫూర్తి తో పేదలకు సాయం అందిస్తా.

**-వైసీపీ జిల్లా కార్యదర్శి తాడాల చక్రవర్తి.**

కడియం
ఇచ్చిన మాటకు కట్టుబడే నిజమైన నాయకుడు జగన్ అని వైసీపీ ప్రభుత్వ హయాంలో నవరత్నాలు అమలు చేసి జనం గుండెల్లో గూడు కట్టుకున్న జగన్ విజయ యాత్ర ఆపే శక్తి ఎవరికీ లేదని వైసిపి జిల్లా కార్యదర్శి తాడాల చక్రవర్తి తెలిపారు. కడియం మండలం, బుర్రిలంకలో వైసీపీ నాయకులు, కార్యకర్తల మధ్య జగన్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరిగాయి.కేక్ కట్ చేసి నిరుపేదలకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు.తమ నాయకుడు జగన్ ఆశయ సాధన కోసం నిరుపేదలకు టీవీసీ ట్రస్ట్ తరుపున తన వంతు సాయం అందిస్తానని చక్రవర్తి ఈ సందర్భంగా ప్రకటించారు. జగన్ పాలనలో నిరుపేదలకు ,డ్వాక్రా మహిళలకు ఆర్థిక సహాయాలు అందజేశారు అన్నారు.నిరుద్యోగ భృతి వేల మంది వాలంటీర్లకు ఉపాధి కల్పించారన్నారు. లక్షల మంది పేదలకు పెన్షన్లు,, ఇంటింటికి రేషన్ సౌకర్యం, విద్యార్థులకు ఫీజు రాయితీలు, మెరుగైన ఉచిత వైద్యం ఇలా ఎన్నో సదుపాయాలు అందించారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కావస్తున్నా ఒక్క నిరుపేదకు సెంటు స్థలం ఇవ్వని పరిస్థితి గమనించాలని చక్రవర్తి అన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు కొత్తపల్లి శివాజీ, తిరుమల శెట్టి శ్రీనివాస్, ఐతి లరెడ్డి తాతయ్య కాపు ,దేవరపల్లి సరిత రాణి, ఊటుకూరి శైలజ ,చింతపర్తి రాంబాబు, దాసరి శ్రీను, గణేశుల చక్రవర్తి, నూనె వరహాలు, రత్నం వెంకన్న బాబు ,తోపాటి దుర్గాజి, బిల్లుకుర్తి ముత్యాలరావు, చెరుకూరి రామకృష్ణ, గాడి శ్రీను ,ఆలమూరు శ్రీను, చెల్లుబోయిన ప్రసాద్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు

# ఆమె నేత్రాలు సజీవం

మద్దిశెట్టి అరుణమ్మ నేత్రదానం



కావలి, : తమ తల్లి నేత్రాలు సజీవంగా మరో ఇద్దరిలో ఉండి, వారికి చూపు కల్పిస్తున్నాయని తాము భావిస్తున్నామని ప్రముఖ బీజేపీ నాయకుడు మద్దిశెట్టి నరేంద్ర పేర్కొన్నారు. మద్దిశెట్టి నరేంద్ర తల్లి అరుణమ్మ ఆదివారం రాత్రి అకాల మరణం పొందారు. అప్పటి తమతో ఉల్లాసంగా గడిపిన తమ తల్లి అకాలమరణం పొందినప్పటికి సామాజిక బాధ్యతగా ఆమె నేత్రాలను దానం చేయడానికి నిర్ణయించి రెడ్ క్రాస్ బాధ్యులను సంప్రదించగా వారు ఏర్పాట్లు చేసారని ఆయన వివరించారు. మోడరన్ ఐ బ్యాంకు సిబ్బంది వేణుగోపాల్ అరుణమ్మ కార్నియాలను సేకరించారు. రెడ్ క్రాస్ ప్రతినిధులు డి రవిప్రకాష్, కలికి శ్రీహరిరెడ్డి మాట్లాడుతూ, మద్దిశెట్టి నరేంద్ర సోదరులు శ్రీనివాసులు, వంశీకృష్ణ ఇతర కుటుంబసభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఇది కావలి రెడ్ క్రాస్ ద్వారా జరిగిన 156వ నేత్రదానమని వారు పేర్కొన్నారు.

# ఘనంగా జగన్ పుట్టినరోజు వేడుకలు.



కడియం
పరిపాలన లో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చి సంక్షేమ పథకాల ద్వారా పేదల గుండెల్లో గూడు కట్టుకున్న మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పుట్టినరోజు వేడుకలను వినూత్నంగా నిర్వహిస్తున్న వైసీపీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల బాబు అభినందనీయులని మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అన్నారు. ఆదివారం కడియం లో గిరజాల బాబు ఆధ్వర్యంలో జరిగిన వేడుకలలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. జగన్మోహన్ రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మించ తలపెట్టిన 17 మెడికల్ కాలేజీల చిత్రపటాలను ప్రదర్శిస్తూ, అరటి పళ్ళు మరియు పువ్వులతో జగన్ చిత్రపటాన్ని వినూత్నంగా తీర్చిదిద్ది పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.పేద విద్యార్థికి సైతం వైద్య విద్య అందాలనే సదుద్దేశంతో నిర్మిస్తున్న మెడికల్ కాలేజీలను ప్రైవేటు పరం చెయ్యాలనే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని వేణు డిమాండ్ చేశారు. అనంతరం వైసిపి కార్యకర్తలు అభిమానులు మధ్య భారీ కేక్ కటింగ్ చేశారు. మండలంలోని పలు గ్రామాలలో జగన్మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, విద్యార్థులు, స్థానిక ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

# యుటిఎఫ్ జిల్లా కార్యదర్శిగా చిలుకూరిమాస్టారు.

కడియం అ



యుటిఎఫ్ జిల్లా కార్యదర్శిగా కడియం గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు , సీనియర్ యూనియన్ నాయకులు చిలుకూరి శ్రీనివాసరావు ఎంపికయ్యారు. యుటిఎఫ్ తూర్పుగోదావరి జిల్లా నూతన కౌన్సిల్ ఎంపిక ఆదివారం రాత్రి తాళ్లపూడి మండలం బల్లిపాడు లో జరిగింది. జిల్లా నూతన కార్యవర్గంలో భాగంగా శ్రీనివాసరావును మరోసారి కార్యదర్శిగా ఎన్నుకున్నారు. శ్రీనివాసరావు ఐక్య ఉపాధ్యాయ మాసపత్రిక పత్రికా ఉపసంపాదకులుగా కూడా వ్యవహరిస్తున్నారు. శ్రీనివాస్ ఎంపిక పట్ల యుటిఎఫ్ నేతలు సతీష్ రెడ్డి, పితాని సత్యనారాయణ, గండి స్వామి ప్రసాద్, ఆకుల వీర్రాజు అభినందనలు తెలిపారు.

# ఫలించిన కందుకూరు ఎం ఎల్ ఏ ఇంటూరి నాగేశ్వరరావు కృషి

### రాళ్లవాగుపై బ్రిడ్జి నిర్మాణానికి 2 కోట్లు మంజూరు- గుడ్లూరు - తెట్టు మార్గంలో రాకపోకలకు ఇక ఇబ్బందులు తొలగినట్లే

కందుకూరు,
మండల కేంద్రమైన గుడ్లూరు నుండి తెట్టు వెళ్లే మార్గంలో రాళ్ల వాగు పై బ్రిడ్జి నిర్మాణానికి రెండు కోట్ల రూపాయలు నిధులు మంజూరు కావడం తో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు కృషి ఫలించిందని, ఈ మార్గంలో రాకపోకలకు ఎటువంటి ఇబ్బందులు ఉండవని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.
భారీ వర్షాలు కురిసినప్పుడల్లా గుడ్లూరు మండలంలోని చెమిడిదపాడు - పోట్లూరు మధ్య రాళ్ళవాగు ఉధృతంగా ప్రవహించడం, గుడ్లూరు - కావలి మధ్య రాకపోకలు నిలిచిపోవడం ఈ సమస్య చాలా సంవత్సరాలుగా ప్రజలను ఇబ్బంది పెడుతోంది. అటవీ భూముల్లోని వరదనీరు ఈ వాగుకు చేరుతోంది. గత పాలకులు కూడా దీనిని పట్టించుకోలేదు. ఇటీవల దిత్వా తుఫాను సమయంలో కూడా ఈ వాగు పొంగడంతో రెండు రోజులపాటు రాకపోకలు ఆగిపోయాయి. ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని నిశ్చయించుకున్న మన కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు ఇప్పటికే అనేకసార్లు రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. ప్రస్తుతం ఉన్న నేలచప్టా స్థానంలో, బ్రిడ్జిని నిర్మించాలని విజ్ఞప్తి చేశారు . ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు కృషి ఫలితంగా రాళ్లవాగుపై బ్రిడ్జి నిర్మాణానికి 2 కోట్లు రూపాయలు మంజూరయ్యాయి. దీనిపై ప్రభుత్వం తాజాగా పరిపాలన ఉత్తర్వులు ఇచ్చింది. రాళ్లవాగుపై ఎట్టకేలకు బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు కావడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రజా సమస్యల పట్ల వెంటనే స్పందించే మనస్తత్వం నిధులను రాబట్టడంలో ఆయన చూపిస్తున్న చొరవను నియోజవర్గ ప్రజానీకం కొనియాడుతోంది.



# నారా లోకేష్ ని కలిసిన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు



కందుకూరు,
ఐటీ మరియు విద్యాశాఖ మంత్రివర్యులు నారా లోకేష్ ని కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు సోమవారం హైదరాబాదులోని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. కందుకూరు నియోజకవర్గాన్ని తిరిగి ప్రకాశం జిల్లాలో కలిపినందుకు ప్రజల తరఫున ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నియోజకవర్గంలో చేపట్టిన 200 కోట్లకు పైగా విలువైన అభివృద్ధి పనుల గురించి లోకేష్ కి నాగేశ్వరరావు వివరించారు. కందుకూరుపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నందుకు, అడిగిన వెంటనే నిధులు మంజూరు చేస్తున్నందుకు కృతజ్ఞతలు తెలియజేశారు.
నియోజకవర్గ చరిత్రలో ఎప్పుడూలేనంతగా పెద్దఎత్తున అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు జరుగుతుండడంపట్ల నారా లోకేష్ సంతృప్తి వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యేను అభినందించారు. రాబోయే మూడేళ్లలో కందుకూరు నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక సిద్ధంచేసి తనకు ఇవ్వాలని లోకేష్ ఎమ్మెల్యేకు సూచించారు.



ప్రతి పనిని తప్పక పూర్తిచేసేలా, నిధుల లభ్యతను బట్టి ప్రాధాన్యత క్రమంలో పనులు మంజూరు చేస్తామని లోకేష్ హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే కుమారులు అవినాష్, సందీప్ చదువులు, వారి భవిష్యత్తు ప్రణాళికల గురించి లోకేష్ ఎంతో ఆత్మీయంగా అడిగి తెలుసుకున్నారు. వారితో విలువైన విషయాలను పంచుకోవడమే కాకుండా, నిరంతరం ప్రజాసేవలో భాగస్వాములు కావాలని లోకేష్ సూచించారు.




## గుడ్లూరు హైస్కూల్లో ఘనంగా జాతీయ గణిత దినోత్సవం

గుడ్లూరు,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గుడ్లూరు నందు సోమవారం శ్రీనివాస రామానుజన్ జయంతి పురస్కరించుకొని జాతీయ గణిత దినోత్సవాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు గణితంలో క్విజ్ పోటీలు నిర్వహించడం జరిగింది. ఇందులో గెలుపొందిన విద్యార్థినీ విద్యార్థులకు బహుమతులను ప్రధానం చేయడం జరిగింది. విద్యార్థిని విద్యార్థులకు మిఠాయిలు పంచి పెట్టడం జరిగింది. ఉపాధ్యాయులు శ్రీనివాస రామానుజన్ గొప్పదనాన్ని నేటి ఆధునిక జీవితంలో గణిత శాస్త్రం యొక్క ప్రాముఖ్యతను గూర్చి ,దాని అనువర్తనాల గురించి విద్యార్థులకు వివరించడం జరిగింది. గణితానికి భారతీయ గణిత శాస్త్రజ్ఞులు చేసిన కృషిని విద్యార్థులకు తెలియ తెలియజేయడం జరిగింది .ఈ కార్యక్రమం ప్రధానోపాధ్యాయుడు పి.వి రామ్మోహన్ అధ్యక్షతన జరిగినది .ఇందులో పాఠశాల ఉపాధ్యాయులు వి. మురళి,ఆర్. రవీంద్రారెడ్డి, బి. వెంకటేశ్వర్లు,బి. వి.ఎల్. నారాయణమూర్తి, ఏ. శ్రీనివాసరావు, కె .శ్రీనివాసరావు, ఎం. శ్రీనివాసరావు జి .మాల్యాద్రి,ఎం. మురళీ కృష్ణ, ఎం రాఘవేంద్ర పి దీప్తి పాల్గొన్నారు.

## బోయినపల్లి సర్పంచ్ ను సన్మానించిన మార్కెట్ కమిటీ చైర్మెన్, సర్పంచ్‌ల ఫోరమ్ అధ్యక్షులు

బోయినపల్లి, డిసెంబర్ 22( ):- బోయినపల్లి సర్పంచ్ గా నల్లమోహన్ ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం బోయినపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ బోయిని ఎల్లేష్, మండల సర్పంచ్ ల ఫోరమ్ అధ్యక్షులు, మర్లపేట సర్పంచ్ భీమ్ రెడ్డి మహేశ్వర్ రెడ్డి సర్పంచ్ నల్లమోహన్ సన్మానించారు. ఈ కార్యక్రమం లో రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ నాయకులు కూస రవీందర్,మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు నిమ్మ వినోద్ రెడ్డి తదితరులు వున్నారు



## టిఆర్ఆర్ జూనియర్ కళాశాలలో గణిత దినోత్సవ వేడుకలు

కందుకూరు,
తిక్కవరపు రామిరెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గణిత దినోత్సవ వేడుకలు జరిగినవి. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా కళాశాల ప్రిన్సిపల్ షేక్ నాగూర్ వలి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ రామానుజన్ ని ఆదర్శంగా తీసుకొని



ఇష్టముతో కష్టపడి చదివి మంచి ఉన్నత స్థితికి వెళ్లాలని తెలిపారు. కళాశాల పౌరశాస్త్ర అధ్యాపకులు ఓరుగంటి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ లెక్కలు నిజజీవితంలో అంతర్భాగమని,గణితము లేని జీవనము ఉండదని రామానుజన్ గురించి అసమాన శక్తిసామర్థ్యాలకు, అరుదైన ప్రతిభకు రామానుజన్ నెలవెత్తు నిదర్శనమని తెలిపారు. అధ్యక్షత వహించిన గణిత అధ్యాపకులు బీవీ కాశీరత్నం రామానుజన్ గురించి విద్యార్థులకు వివరిస్తూ గణిత శాస్త్రము మనిషిగా అవతరిస్తే రామానుజన్లా ఉంటుందేమో! రామానుజన్ లేని గణిత శాస్త్రము అసంపూర్ణమని,గణిత శాస్త్రము అంతలా అతని జీవితంలో కలిసిపోయాయని, 1729 రామానుజన్ సంఖ్య యొక్క గొప్పతనాన్ని విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో అధ్యాపక బృందము విద్యార్థిని,విద్యార్థులు పాల్గొన్నారు.

## ముచ్చటగా మూడోసారి “ఎమ్మెల్సీ బీద రవిచంద్ర” కు జిల్లా అధ్యక్షుడు పదవి చేపట్టడంతో మలిశెట్టివెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ సర్కిల్లో సంబరాలు

కావలి, :
నెల్లూరు జిల్లా టిడిపి సీనియర్ నాయకుడుఎమ్మెల్సీ బీద రవిచంద్ర కు నెల్లూరు జిల్లా టిడిపి అధ్యక్షులుగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించడంతో కావలి ఎంపీ రోడ్ లోఉన్న ఎన్టీఆర్ విగ్రహంవద్ద ఆదివారం రాత్రి బాణా సంచ కాల్చి, స్వీట్లు పంచుతూ సంబరాలు నిర్వహించారు..రాష్ట్ర టిడిపి కార్యదర్శి మలిశెట్టి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ విగ్రహానికి గజమాలను వేసిన మన్నవ రవిచంద్ర,బొట్లగుంట శ్రీహరి నాయుడు,పోతుగంటి ఆలేఖ్య,బొంత శ్రీనివాస్ యాదవ్,జినిగర్ల మనోహర్ యాదవ్, రమణయ్య యాదవ్, ఖలిల్,కిరణ్,మరియు టీడీపీ నేతలు.ఈ సందర్భంగా ప్రముఖ ఆర్యవైశ్య టిడిపినేత 30వ వార్డ్ టీడీపీ ఇంచార్జ్ గాదంశెట్టి వేణుగోపాల్ మాట్లాడుతూ కష్టకాలంలో జిల్లాలో టిడిపి పార్టీని తన భుజస్కందాలపై మోసిన వ్యక్తి బీద రవిచంద్ర అని అన్నారు.ఎల్లవేళలా పార్టీ నేతలకు అందుబాటులో ఉంటూ తన సహాయ సహకారాలు అందిస్తున్న బీద రవిచంద్ర కు జిల్లా అధ్యక్ష పదవి రావడం సంతోషంగా ఉందని,పార్టీ ని నమ్ముకొని ఉన్న కార్యకర్తలకు అండగా ఉంటూ,కావలి అభివృద్ధి లో బీద సోదరులు పాత్ర ఉందిఅని కొనియాడారు.జిల్లా అధ్యక్ష పదవి ఇచ్చిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారికి ధన్యవాదాలు తెలియజేస్తున్నామని వక్తలు అన్నారు.



# బిపియస్ ఐస్ క్రీం షోరూంను ప్రారంభించిన ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి

కావలి :
కావలి పట్టణంలో అతి పెద్ద ఐస్‌క్రీమ్, స్వీట్స్,బేకరీని నూతన భవనంలో రూపొందించిన %దీూ%ను పున ప్రారంభించిన కావలి శాసనసభ్యులు కావ్య కృష్ణారెడ్డి చేతుల మీదగా సోమవారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి కి బెజవాడ ప్రకాష్ రావు దంపతులు,పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే పూజా కార్యక్రమంలో పాల్గొని,వ్యాపారం సక్రమంగా అభివృద్ధి చెందాలని, సంస్థ మరింత ప్రగతి సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ,కావలి ప్రజలకు నాణ్యమైన ఆహార పదార్థాలను అందించేలా ఇలాంటి వ్యాపార సంస్థలు ముందుకు రావడం అభినందనీయమని అన్నారు. నాణ్యత, పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇచ్చి ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలని బెజవాడ ప్రకాష్ రావు దంపతులకుసూచించారు. అనంతరం బెజవాడ ప్రకాష్ రావు దంపతులను ఎమ్మెల్యే అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా %దీూ% ద్వారా కావలి పట్టణ ప్రజలకు క్వాలిటీ ఐటమ్స్ స్వీట్స్,బేకరీని అందుబాటులోకి రావడం సంతోషకరమని పేర్కొన్నారు. కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యేని నిర్వాహకులు ఘనంగాసన్మానించారు. ఈ కార్యక్రమంలో స్థానిక పార్టీ నాయకులు,వ్యాపారవేత్తలు,అభిమానులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రారంభోత్సవాన్ని విజయవంతం చేశారు.



## రహదారి, కల్వర్టుల నిర్మాణానికి నిధుల మంజూరు -రూ.60లక్షలతో అభివృద్ధి పనులు

ఆలమూరు, ఆలమూరు మండలం కొత్తూరు సెంటర్ నుండి సంధిపూడి వరకు ప్రధాన రహదారి నిర్మాణానికి రూ.37 లక్షలు, ఆలమూరులో మూడు కల్వర్టుల నిర్మాణానికి రూ.23 లక్షలు మంజూరు అయినట్లు ఆలమూరు మండల తెదేపా అధ్యక్షులు ఈదల సత్తిబాబు, ప్రధాన కార్యదర్శి సలాది నాగేశ్వరరావు తెలియజేశారు. మండల కేంద్రమైన ఆలమూరు తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద వారు మాట్లాడుతూ ఇప్పటికే నర్సిపూడి నుంచి కొత్తూరు సెంటర్ వరకు రహదారి నిర్మాణం పూర్తయిందని, కొత్తూరు సెంటర్ నుంచి నుంచి సంధిపూడి వరకు రహదారి అభివృద్ధి కోసం తాజాగా నిధులు మంజూరయ్యాయని వారు తెలిపారు. త్వరలోనే టెండర్లు పిలిచి ఆయా పనులు ప్రారంభించనున్నట్లు తెలియజేశారు. నిధుల మంజూరుకు కృషిచేసిన ఎమ్మెల్యే బండారు సత్యానందరావుకు సొసైటీ అధ్యక్షుడు వంటిపల్లి సతీష్. నాగిరెడ్డి వెంకటరత్నం, రామానుజుల శేషగిరిరావు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఈదల నల్ల బాబు. తాడి శ్రీనివాసరెడ్డి. మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కేతా రాంబాబు, వక్కపట్ల లక్ష్మణరావు, చెల్లబోయిన శ్రీనివాస్, నాగ చక్రవర్తి, గుండుమల్ల వీర వెంకట రామారావు, ఇల్ల మారుతి, మండల తెలుగుదేశం పార్టీ నాయకులు కృతజ్ఞతలు తెలియజేశారు.



## వాకాటి ధనలక్ష్మికి నివాళులర్పించిన ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి..

కావలి,
కావలి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు,రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కార్య దర్శి తట్టవర్తి రమేష్ అత్తగారు వాకాటి ధనలక్ష్మి మృతి చెందడం పట్ల కావలి శాసనసభ్యులు కావ్య కృష్ణారెడ్డి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి ఆదివారం కావలి పట్టణంలోని జరతాపేట నార్త్ ప్రాంతంలో ఉన్న ధనలక్ష్మి నివాసానికి చేరుకుని ఆమె భౌతిక కాయాన్ని దర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. ధనలక్ష్మి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, వాకాటి ధనలక్ష్మి కుటుంబం సమాజంలో గౌరవనీయ స్థానాన్ని సంపాదించిందని, ధనలక్ష్మి గారి మరణం కుటుంబ సభ్యులకు తీరని లోటని పేర్కొన్నారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే, తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ ఈ కష్ట సమయంలో భగవంతుడు వారికి మనోధైర్యం ప్రసాదించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు,ఆర్యవైశ్య సంఘం సభ్యులు, బంధువులు, సన్నిహితులు తదితరులు పాల్గొని ధనలక్ష్మికి కన్నీటి నివాళులు అర్పించారు.



## ఆక్స్ ఫర్డ్ పాఠశాలలో ఘనంగా గణిత దినోత్సవ వేడుకలు

కందుకూరు,
కందుకూరు పట్టణంలోని పామూరు రోడ్డులో ఉన్న బి.ఆర్. ఆక్స్ ఫర్డ్ ఐఐటి ఒలింపియాడ్ స్కూల్ లో గణిత దినోత్సవ వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు.?ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన విద్యాసంస్థల చైర్మన్ ఉన్నం భాస్కర్ రావు మాట్లాడుతూ, గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకుని ఈ వేడుకలు జరుపుకోవడం ఆనందదాయకం అన్నారు. విద్యార్థులు గణితం పట్ల భయం వీడి, ఇష్టంతో నేర్చుకుంటే అద్భుతాలు సృష్టించవచ్చని సూచించారు. గణితం కేవలం సబ్జెక్టు మాత్రమే కాదని, అది మన దైనందిన జీవితంలో ఒక భాగమని ఆయన తెలిపారు.?సంస్థ డైరెక్టర్ జి. బాల భాస్కర్ రావు మాట్లాడుతూ, విద్యార్థులలో తార్కిక ఆలోచనా శక్తిని పెంపొందించడంలో గణితం కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. విద్యార్థులు చిన్నప్పటి నుండే గణిత సూత్రాలపై పట్టు సాధించాలని కోరారు.
?ఈ వేడుకలలో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన వివిధ గణిత నమూనాలు, ఫజిల్స్, మ్యాథ్స్ యాక్టివిటీలు అందరినీ విశేషంగా ఆకట్టుకున్నాయి. విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా ఈ ప్రయోగాలలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల కరస్పాండెంట్ బండి వెంకటేశ్వర్లు, డైరెక్టర్ నరేంద్ర బాబు, పాఠశాల డీన్, ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.